# మహానగరం కథలు
## -వేదుల సుభద్ర




*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బడి ముబ్బిడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్థమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్థికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!

# ఇబ్బంది

" అమ్మా నీడ్స్ టు టేక్ ఇట్ ఈజీ.. పిల్లలన్నాకా పడరా? మనందరం పడకుండానే పెద్దవాళ్ళమైయ్యామా? పాప దగ్గరకొచ్చేసరికి అమ్మని అస్సలు పట్టుకోలేము" అంటున్న ఆ యువకుడిని చిత్రంగా చూశాడు భాస్కర్..

స్విమ్మింగ్ పూల్ దగ్గర కూర్చుని ఉన్నారా నలుగురు. ముప్పైల్లో ఉంటారేమో..

“అవును, అప్పుడప్పుడు మీ అమ్మకి ఛాదస్తం ఎక్కువయిపోతోంది" అంది ఓ అమ్మాయి నెమ్మదిగా. అతని భార్య కాబోలు.

వేష భాషల్లో అందరూ ఆధునికంగా ఉన్నారు. మగవాళ్ళిద్దరూ షార్ట్స్, టీ షర్ట్స్ వేసుకున్నారు.. ఆడవాళ్ళిద్దరూ స్కర్ట్ లు, బ్లౌజులు వేసుకున్నారు.

అప్పటివరకూ ఆడుకుంటూ కింద పడిన రెండేళ్ళ పాపని గభాల్న వచ్చి ఎత్తుకుని, ఏడుపు మరిపించడానికి పక్కకి తీసుకువెళ్ళిన పెద్దావిడని గురించే వాళ్ళు మాట్లాడుకునేది.

ఇతనే కదా పొద్దున్న లిఫ్ట్ లో వాళ్ళ అమ్మ చేతిలోంచి పాప జారబోతుంటేనే " అమ్మా, కొంచం శ్రద్ధగా ఉండాలి కదా నువ్వు, చూడు కొంచం ఉంటే పడేది “ అంటూ, అది లిఫ్ట్ అని కానీ, పక్కనింకో ఇద్దరు వ్యక్తులున్నారని కానీ చూడకుండా తల్లి మీద విరుచుకుపడ్డది.

తన చేతిలోంచి జారితే “ పడుతూ, లేస్తూ పెరుగుతారా?వాళ్ళ అమ్మ చేతిలోంచైతే పడి కిందే ఉంటారా?"

తన ఊహలకి తనకే నవ్వొచ్చింది భాస్కర్ కి.

‘ఈ టెంప్లేట్ పిల్లలంతా ఒకేలా ఎలా ఉంటారు? ఇలా తు. చ తప్పకుండా, వీళ్ళంతా ఒకేలా ఎలా ప్రవర్తిస్తారు? ఆలోచన ఉండదా? ‘అనుకుంటే మరింత నవ్వొచ్చింది అతనికి..

అమెరికాకి ట్రాన్స్ ఫర్ మీద వచ్చి నాలుగురోజులయింది. అపార్ట్ మెంట్ లీజుకైతే తీసుకున్నారు కానీ ఇంకా ఆర్డర్ చేసిన ఫర్నిచర్ అవీ రాలేదు. అమెరికాలో డ్రైవ్ చెయ్యడం వచ్చినందువల్ల ఇబ్బంది లేకుండా రోజూ కొన్ని తెస్తున్నాడు.

మరో పదేళ్ళలో రిటైరయ్యేవయసు వస్తోంది, ఇప్పుడెందుకు? అనుకున్నాడు మొదట. అనుకోకుండా ఇద్దరికీ ట్రాన్స్ ఫర్ లు కుదరడం, చదువులకని వచ్చిన పిల్లలిద్దరూ ఇక్కడే ఉండిపోవడం వల్ల వచ్చేశారు తను, భార్య సునీత.

కస్టమర్ మీటింగులు ఉండడం వల్ల రాగానే భార్య సునీత తన ఆఫీస్ పని మీద వేరే చోటకి వెళ్ళవలసి వచ్చింది.. తనొక్కడూ అన్నీ చూసుకోవాలని ఆమె బాధపడుతూ ఉంటే..

" దీంట్లో ఏముంది? నాకలవాటే కదా సునీ, నేను మానేజ్ చేస్తాను. నువ్వొచ్చేసరికి ఇల్లంతా వీలున్నంతవరకూ సర్దేసి, మేడం గారి రాకకోసం ఎదురు చూస్తాను" అన్నాడు తను.

నవ్వింది సునీత ఆ మాటలకి.

ఖాళీ ఫ్లాట్ లో కూర్చోడానికేమీ లేక, స్విమ్మింగ్ పూల్ దగ్గర ఉన్న సోఫాల్లో కాసేపు, బిజినెస్ సెంటర్ లో కాసేపు కూర్చుని, వీలున్నప్పుడల్లా పనిచేసుకుంటూ కాలక్షేపం చేస్తున్నాడు భాస్కర్. అవసరమైనప్పుడు ఆఫీసుకి వెళ్ళిరావడం తప్పటం లేదతనికి.

మర్నాడు మధ్యాహ్నం అద్దెకి తీసుకున్న కార్ నిండా, పెట్టెలతో సామాన్లు తెచ్చుకుని వచ్చాడతను. వాటిని ఫ్లాట్ దగ్గర పెట్టి అర్జంటుగా ఆఫీసుకు వెళ్ళాలి. ఒక్కొక్క డబ్బా మోసుకుంటూ మూడో అంతస్థుకు వెళ్ళేసరికి చాలా టైమవుతుంది, అలాగని కార్ నలాగే ఆఫీసుకు తీసుకు వెళ్ళడానికి లేదు. తప్పేదేముందని ఒక్కొక్కటిగా ఒకదగ్గర చేరిస్తే సులువవుతుందని తేవడం మొదలు పెట్టాడు.

అప్పుడే కనిపించారు ఆవిడ, నిన్న రాత్రి చూసినావిడే, చేతిలో అదే చిన్న పాప..\

‘హలో!’ అంటూ పలకరించారు..

మాసిపోయినట్టుగా ఉన్న పాత చూడీదార్ వేసుకున్నారు, జుట్టుని ఇంట్లో స్నానానికి వెళ్ళేప్పుడు వేసుకునే లాంటి ముడి. భుజం మీద చిన్న నేప్ కిన్.

చేతిలో చిన్న పాప, తెల్లగా ముద్దుగా రబ్బరు బొమ్మలా ఉంది..

" హలో మేడం" అన్నాడు భాస్కర్ బావుండదని. అతనికిప్పుడు టైము లేదు నిజానికి.

"మీరిలా ఒక్కొక్కటి పట్టుకెళ్ళక్కరలేదు, ఆ మూల కార్ట్ ఉంటుంది, అది తెచ్చుకుని అన్నీ ఒకేసారి తీసుకువెళ్ళండి ఈజీ. నేనూ సహాయం చేద్దును కానీ పాపాయి ఉంది కదా!" అన్నారావిడ ఇంగ్లీష్ లో.

కృతజ్ఞతాపూర్వకంగా చూశాడు ఆవిడ వైపు.

“థాంక్ యూ మేడం!” అంటూ గబగబా వెళ్ళి ఆ కార్ట్ లో అన్నీ సర్ది ఇంట్లో పడేసి వచ్చి, ఆవిడకి మళ్ళీ కృతజ్ఞతలు చెప్పి ఆఫీసుకు వెళ్ళి మరో రెండు గంటల తర్వాత వచ్చేసరికి ఆవిడ, పాప అక్కడే ఉన్నారు. పాపకి వేరే గౌన్ వేశారు, తల దువ్వి రబ్బర్ బాండ్తో చిన్న పోనీ టెయిల్ వేశారు

"ఈరోజు వీళ్ళ అమ్మ త్వరగా వస్తానంది, అందుకే ఎదురు చూస్తున్నాం, రాగానే అమ్మ దగ్గరకెళ్ళాలంటే పాపకి చాలా ఇష్టం" అన్నారు.

" అమ్మ దగ్గరకెళ్ళాలంటే ఎవరికిష్టం ఉండదు?" అన్నాడు భాస్కర్..

" కరక్ట్ గా చెప్పారు.. అమ్మ అన్న బంధమే అన్నింటికీ మూలం, బలం, బలహీనత కూడా" అన్నారావిడ ఎటో చూస్తూ..

" ఏమన్నారు?" అడిగాడు భాస్కర్ అర్థం కానట్టుగా..

అంతలో ఆవిడ ఫోన్ మోగింది.. " ఓ సరేనమ్మా, మరో అరగంట పడుతుందా? ఓకే, నిజమే! ఎండగానే ఉంది, లోపలకి తీసుకెళ్తా" అంటూ మాట్లాడి, ఫోన్ పెట్టేశాకా

"మా కోడలికి మరో అరగంట పడుతుందిట, పాపని ఎండలో ఎందుకు? ఇంటికి వెళ్ళిపోమంది, మీరు కూడా మా ఇంటికి రావచ్చు కదా, కాఫీ వేళైంది కదా, ఫిల్టర్ కాఫీ ఇస్తాను" అన్నారావిడ గబగబా.

భాస్కర్ ఏమీ అనకముందే.

" మీకు ఆ పెద్ద పెద్ద డబ్బాలెత్తేటప్పుడు ఏమీ ఇబ్బంది అవలేదు కదా, బాక్ పెయిన్ లాంటివి. ఏదైనా అయితే మనమూ, మనతో పాటు పిల్లలూ ఇబ్బంది పడాలి" అన్నారావిడ చిత్రంగా.

" అబ్బే, అవేమీ పెద్ద బరువు లేవండి.నేను, నా వైఫ్ ఉంటామండి ఇక్కడ, ట్రాన్స్ఫ ఫర్ అయి వచ్చాము ఇండియానించి" అన్నాడు భాస్కర్..

ఆవిడా మాటలు పెద్దగా పట్టించుకున్నట్లు గా కనిపించలేదు.

“ మీరు చిన్నవారే లెండి, నేనూరికే అన్నాను! మీరేమీ అనుకోలేదుగా” అన్నారావి చిన్నగా నవుతూ..

భాస్కర్ కూడా నవ్వాడు..” పరవాలేదు లెండి. నేను తలకు రంగు వేసుకోను, నేచురల్ గా ఉండడమే నాకిష్టం” అన్నాడు

" కాఫీ కి రండి" అంటూ చనువుగా చెప్పింది మళ్ళీ.

" మరో సారి వస్తానండి" అంటూ తప్పించుకున్నాడు భాస్కర్.

" మీకేమైనా పూజ సామాన్లు, పుస్తకాలు కావాలంటేనేనిస్తాను" అందావిడ మళ్ళీ.

" మేమిద్దరం పెద్దగా పూజలు అవీ చెయ్యమండి..కావాలంటే తప్పకుండా తీసుకుంటాను" అన్నాడు.

" నా పిచ్చి గానీ, ఇప్పుడన్నీ నెట్ లోనే ఉన్నాయి కదా," అంటూ తన గురించి చెప్పడం మొదలు పెట్టిందావిడ. తన పేరు రాజేశ్వరి అని, భర్త పేరు వైకుంఠన్ అని.. తామిద్దరూ కలిసి చెన్నై లో స్కూల్ నడిపేవాళ్ళనీ, అతనున్నప్పుడు వేసవి శలవుల్లో వచ్చేవాళ్ళమనీ, రెండేళ్ళ క్రితం భర్త పొయాకా తాను ఇక్కడికే వచ్చేశానని చెప్పారావిడ.

తమ కొడుకు ఇక్కడే ఉండడం వల్ల తాను ఇక్కడేఉంటున్నానని చెప్పిందావిడ.

మౌనంగా విన్నాడు.

“ఇక్కడంతా బాగానే ఉంటుంది, ముఖ్యంగా ఉద్యోగాలు చేసుకునే మీలాంటివాళ్ళకి. కానీ పెద్దవాళ్ళకి మాత్రం ఇదో బంగారు పంజరమే! పాపాయి తోడుండబట్టి కానీ లేకపోతే నేనేమయిపోయేదాన్నో? అనిపిస్తుంది. ముఖ్యంగా ఆయన లేని ఈ రెండేళ్ళలో మరీనూ” చెప్పిందావిడ.

ఎన్నో ఏళ్ళ సహచరుడిని కోల్పోయిన తర్వాత ఆ మాత్రం బాధ, ఒంటరితనం ఫీలవడం సహజమే కదా, అనుకున్నాడు.

“మీకు బోర్ కొట్టిస్తున్నానా?” అంటూ ఆగిందావిడ..

“లేదు, పరవాలేదు చెప్పండి!" అన్నాడు భాస్కర్ మొహమాటంగా.

" నేను ఏం. ఏ చదువుతున్నప్పుడు పరిచయం అయ్యారు మా వారు, ఆపైన నేను బి.ఈడీ చేస్తున్నప్పుడు మా పెళ్ళి అయింది. ఆతర్వాతే మేము స్కూల్ పెట్టాము, తన ఆలోచనే అది." ఇలా పది నిమిషాలు సాగిందావిడ వాక్ప్రవహం. ఎక్కువగా భర్త, స్కూల్ గురించిన కబురులు, వాళ్ళ అబ్బాయి, మనవరాలి విషయాలు.. కొద్దిగా కోడలి కబుర్లు..

ఆ పదినిమిషాల తర్వాత " వస్తాను మేడం, ఇందాకా తెచ్చిన సామాన్లు సర్దాలి, సునీత, అదే నా భార్య ఎల్లుండి పొద్దున్నే వస్తుంది" అంటూ లేచాడు..

మర్నాడు పొద్దున్నే " ఈరోజు ఇడ్లీ, సాంబార్ చేశాను.. మీరొక్కరే ఉంటానన్నారు కదా, పాపం ఏం తింటున్నారో ?అని తెచ్చాను" అంటూ వచ్చిన ఆవిడని చూసి

" అయ్యో, మా ఇద్దరికీ ఆఫీస్ కాంపులు, వండుకోవడాలు అలవాటేనండి, మీరెందుకు అనవసరంగా శ్రమ పడ్డారు?" అంటూ ఆవిడ తెచ్చినవి తీసుకుని, పాపకో చాక్ లెట్ ఇచ్చి పంపాడు.

ఆ సాయంత్రం స్విమ్మింగ్ పూల్ దగ్గర కనిపించినప్పుడు ఆవిడ కొడుకునీ, కోడలినీ పరిచయం చేసిందావిడ. ఆ అబ్బాయి పేరు సుకుమార్, కోడలి పేరు భువన.

రెండు నిమిషాలు మాట్లాడామనిపించి వెళ్ళిపోయారు వాళ్ళు.

"వరలక్ష్మి పూజకి మీరు మా ఇంటికి రావాలి, ఎక్కువ రోజులు లేదు" అంటూ ఆవిడేదో చెప్పబోతుంటే..

"అమ్మా, పాపకి అన్నం పెట్టాలి, మర్చిపోయావా?" అంటూ పిలిచాడు సుకుమార్. అలా పిలిచినపుడతని కళ్ళల్లో కదలాడిన భావమిదని తెలియకపోయినా భాస్కర్ చూపుని దాటిపోలేదు.

" అరే, అవును కదా, మాటల్లో పడితే టైము తెలీదు నాకు. మనం మళ్ళీ కలుద్దాం, పాపకి లేటయితే అరగదు" అంటూ పరుగులాంటి నడకతో వెళ్ళిపోయారావిడ.

మర్నాడు శనివారం కావడాన నెమ్మదిగా నిద్ర లేచాడు భాస్కర్. కాఫీ తాగుతుంటే కాలింగ్ బెల్ మోగింది

"ఫ్లైట్ దిగాను, కాబ్ ఎక్కాను ఇంటికి రావడానికి" అని చెప్పింది సునీత అరగంట క్రితం, అప్పుడే వచ్చేసిందా?" అనుకుంటూనే తలుపు తీశాడు

ఎదురుగా సుకుమార్..

"హలో! లోపలికి రావచ్చా?" ఇబ్బందిగా కదులుతున్నాడు ఎందుకో, తన బరువుని ఒక కాలు మీంచి మరో కాలుమీదకి మార్చుకుంటూ.

" ఐ యాం సారీ, పొద్దున్నే డిస్టర్బ్ చేశానా?" అన్నాడు మొహమాటంగా..

" పర్వాలేదు, రండి, మీరొక్కరే వచ్చారా?" అన్నాడు భాస్కర్, అడ్డం తొలగి దారి ఇస్తూ.

" అవును, ఒక్కడినే, అమ్మ విషయం చెప్పడానికే వచ్చాను" అన్నాడతను ఎవరో తరుముకు వస్తున్నట్టు, చెప్పేసి పారిపోవాలనంట్టుగా ఉంది అతని వ్యవహారం.

" చెప్పండి, ఏమయింది మీ అమ్మగారికి? ఒంట్లో బాగోలేదా? ఎనీ ప్రాబ్లెం?" అన్నాడు భాస్కర్.

" ప్రాబ్లెమా అంటే అవును, కాదా అంటే కాదు" అన్నాడు సుకుమార్ నీళ్ళు నములుతున్నట్టుగా.

" అంటే?? ఈజ్ షీ ఓకే?!" అన్నాడు భాస్కర్, అంతకన్నా ఏమనాలో తెలీక.

ఆ మాటలు పట్టించుకోకుండా "అమ్మ వల్ల మీకేదైనా ఇబ్బంది కలిగితే.. "అంటూ ఆగిన సుకుమార్ వైపు చిత్రంగా చూస్తూ

" ఆవిడ వల్ల మాకేం ఇబ్బంది ఉంటుంది? ఆవిడ చాలా ఫ్రెండ్లీ అనుకున్నాను నేను, సునీత, నా వైఫ్ ఈరోజు రావాలి, వచ్చాక తనతో కలిసి మీ ఇంటికి వద్దామని అనుకున్నాను" అన్నాడు భాస్కర్..

" ఓకే, మీరలా అనుకుంటే పర్వాలేదు" అన్నాడు సుకుమార్. ఇంకా ఏదో మిగిలిపోయినట్టుగా ఉంది అతని ధోరణి.

" నేను ఆఫీస్ కి వెళ్ళక్కరలేదు కానీ మరో అరగంటలో నాకో కాల్ ఉంది, మీరేదో చెప్పాలనుకుంటున్నట్టుగా ఉంది మీ వ్యవహారం చూస్తూ ఉంటే, ఇప్పుడు చెప్పినా సరే లేదంటే మనం సాయంత్రం తీరిగ్గా కలుద్దాం, అప్పుడు చెప్పినా సరే. అసలు చెప్పడానికేమీ లేకపోతే మరీ మంచిది" అన్నాడు భాస్కర్ అంతకంటే ఏం చెప్పాలో అతనికి అర్థం కాలేదు.

నిన్ననేమో అంటీ ముట్టనట్లు గా ఉన్న ఈ కుర్రాడు. ఈరోజు ఎప్పటికీ చెప్పడు, వెళ్ళడు, ఇదేమిటి? సుకుమార్ ధోరణి చాలా వింతగా ఉంది..

“అది కాదు సార్! అమ్మ నాన్నగారు పోయినప్పటినించీ కొద్దిగా చిత్రంగా ప్రవర్తిస్తోంది.... ఎవరైనా నడివయస్సులో ఉన్నవారిని చూస్తే వెంటనే పరిచయం చేసేసుకోవడం, అక్కరలేనివన్నీ మాట్లాడడం, ఏదో పేరు చెప్పి పరిచయం పెంచుకోవడం లాంటివి..” అంటూ ఆపి తన చేతిగోళ్ళవైపు, కాలి వేళ్ళవైపు చూసుకోవడం మొదలు పెట్టాడు.

తను విన్నది అర్థం అవడానికి క్షణం పట్టింది భాస్కర్ కి..

“మీరనేది??” అన్నాడు నెమ్మదిగా.

" నేను గమనించినది మీతో చెప్తున్నాను. తన అతి చనువు వల్ల మీకేమీ ఇబ్బంది రాకూడదనే.” అన్నాడు అదేదో డిస్క్లెయిమర్ అన్నట్లుగా.. నా పని అయింది, ఆపైన నా బాధ్యత లేదు అని సంతకాలు పెట్టించుకునే కొరియర్ సర్వీసులవాళ్ళలా..

“నాన్న ఉన్నప్పుడు ఇద్దరూ వచ్చి వెళ్తూ ఉండేవారు. భువన ప్రెగ్నెంట్ అవ్వడం, నాన్న పోవడం ఇంచుమించు ఒకేసారి జరిగాయి. మాకెవరూ దగ్గర చుట్టాలు లేక, భువనకి తోడుంటుంది కదా అనీ అమ్మని మాతో తెచ్చేసుకున్నాను. అప్పటినించీ మా దగ్గరే ఉంటోంది తను.. పెద్ద ఇంట్లో ఎవరూ కనిపించరు, అపార్ట్ మెంట్ అయితేనే బావుంటుంది అని గొడవచేసేది. మాకూ ఆఫీసులకి దగ్గరని మేము ఎంతో ముచ్చట పడి కొనుక్కున్న ఇల్లు అద్దెకిచ్చి ఇదిగో ఇక్కడకి అద్దెకి వచ్చాం. ఇక్కడకి వచ్చినప్పటినించీ ఇదీ పరిస్థితి.

ఇండియానించి ఎవరొచ్చినా, ముఖ్యంగా మధ్యవయసు మగవారితో వెంటనే పరిచయాలు చేసేసుకోవడం, అక్కరలేని చనువు చూపించడం.. ఏమవుతోందో అర్థం కావడం లేదనుకోండి.. ఎలా చెప్పాలో , ఏమని అర్థం చేసుకోవాలో అసలు తెలీడం లేదు..

అయితే పాప మీద మాత్రం ఈగ వాలనీదు, ఒక్క క్షణం రెప్ప వేస్తే ఏది మిస్సయిపోతుందో అన్నంత జాగ్రత్తగా, తన ప్రాణం కన్నా ఎక్కువగా చూసుకుంటుంది.. అదే పెద్ద బ్లెస్సింగ్.. లేకపోతేనా?” అంటూ ఆగాడు ఒక్క క్షణం.

" లేకపోతే ఇండియా పంపేసేవారు కదూ!" సూటిగా అన్నాడు భాస్కర్.

" సర్! అది!" సుకుమార్ కి రియాక్ట్ అవడానికి టైము దొరకలేదు. కోపంతో ఎర్రబడిన భాస్కర్ మొహం చూస్తూ మరేమీ మాట్లాడే ధైర్యం చెయ్యలేకపోయాడు.

‘మా అబ్బాయి, ఐ. ఐ.టీ లో చదువుకున్నాడు’. ఎంత గర్వంగా చెప్పిందా తల్లి ఈ సుకుమారుడిని గురించి. ఇదా వీడు ఆవిడ గురించి చెప్పేది?

‘మా మనవరాలు అంతా వాళ్ళ నాన్న పోలికే, ఎంతో తెలివైనది. మా కోడలి శుభ్రం, జాగ్రత్త కూడా ఉన్నాయి పాపకి..’ ఆవిడ పొంగిపోతూ చెప్పిన మాటలు...

‘మా వారికీ, నాకూ విశాల దృక్పధాలెక్కువ, నిజం చెప్పాలంటే ఆయన దగ్గరనుంచే నేను నేర్చుకున్నాను’..

ఆవిడ ని చూస్తూ ఇలా ఎలా అనగలిగాడీ అబ్బాయి. కోపంతో భాస్కర్ మనసు ఊగింది..

" మీరేం మాట్లాడుతున్నారో మీకు తెలుస్తోందా?”

“మిమ్మల్ని కని పెంచిన తల్లి గురించి మీరిలా ఆలొచించగలుగుతున్నారంటేనే నాకర్థం అయింది మీకున్న సంస్కారం, మెచ్యూరిటీ.

మీకవసరమైనప్పుడు, మీకు కావలసినట్లుగా మీరు ప్రవర్తించారు, దానికామెని బాధ్యురాలిని చేస్తున్నారే?

మీ నాన్నగారు పోయాకా, మీకు మరో దారి ఉంటే ఆవిడని ఇక్కడికి తీసుకొచ్చేవారా? ఆవిడకి వీసా వచ్చి,మీ అదృష్టవశాన ఇక్కడ ఉండగలిగారు కనక మీకు ఇంట్లో బయటా ఏ పని చేసుకోనక్కరలేకుండా హాయిగా నడుస్తోంది కదా..

ఆవిడ ఒక్కరూ పెద్ద ఇంట్లో ఉండలేక, మీ నాన్నగారి మరణ విషాదం లోంచి తేరుకోలేక ఇల్లు మారడం గురించి మీతో చెప్తే కూడా మీకు ఆఫీసులకి దగ్గర కనక ఇక్కడికి మారారు కానీ ఆవిడ కోసం కాదుగా" ఇవన్నీ మీరు చెప్పిన మాటలే..

" ఆవిడ చేతిలోంచి పాప జారితే అది ఆవిడ నిర్లక్ష్యం, మీరు చూడకపోతే పడితే అది ఆరోగ్యకరమైన పెరుగుదల..అంతేగా!!

ఆవిడ వల్ల నాకేమీ ఇబ్బంది ఎదురవలేదు, కానీ మీరన్న మాటవల్ల ఇబ్బందిగా అనిపిస్తోంది.. "పాపని బాగా చూసుకుంటుంది, లేకపోతే ??" అన్న మాట చాలా చిరాగ్గా, ఇంకా చెప్పాలంటే బాధగా , ఇబ్బంది గా ఉంది సుకుమార్..

మీరు మంచి కుమారుడవ్వాలని ఆ పేరు పెట్టినట్టున్నారు, కనీసం కొంతైనా న్యాయం చేసుకోడానికి ప్రయత్నించండి. ఒక మనిషి, తోటి మనిషి పట్ల చూపే స్నేహానికి, ప్రేమకి వేరే రంగులు పులమకండి. వెళ్లండి. దయచేసి వెళ్ళండి." అని మాత్రం అనగలిగాడు.. చెట్టంత యువకుడిని మరేమీ అనలేక.

●●●

Click here to share your comments on this story